విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 10 డిసెంబరు 2024 8 పేజీలు

అదానీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

- మణిపూర్‌లో హింసను అరికట్టాలి
- నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి
- పెరిగిన నిత్యావసరవస్తువుల ధరలు తక్షణమే తగ్గించాలి
- ఉభయగోదావరి జిల్లాల్లో సీపీఐ నిరసన

ఏలూరులో

ఉండిలో

విశాలాంధ్ర-ఏలూరు/భీమవరం/రాజమహేంద్రవరం/ అదాని అక్రమాలపై పార్లమెంటరీ విచారణ కమిటీ వేయాలని, మణిపూర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపులో భాగంగా దేశంలోని ప్రధాన సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా అన్ని మండలాలలోనూ,పట్టణ నగర ప్రాంతాలలో డిమాండ్స్ డే నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద డిమాండ్స్‌డే సందర్భంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో కోట్ల రూపాయల అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పారిశ్రామికవేత్త గౌతమ్ అదానిపై న్యూయార్క్ కోర్టులో రూ.2,100 కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చాయని, వాటిపై కేంద్ర ప్రభుత్వం నోరు మెదపకుండా, మౌనంగా ఉంటూ అదాని అవినీతిని సమర్థించడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ప్రపంచంలోని అన్ని దేశాలు తిరిగిన మోడీ మన దేశం లోని ఈశాన్య ప్రాంతమైన మణిపూర్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఆ రాష్ట్ర ప్రభుత్వం అల్లర్లను పెంచి పోషిస్తుంటే ఆ ప్రాంతంలో ఏం జరిగిందో పరిశీలించ డానికి ప్రధానమంత్రికి కాలు రావట్లేదని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ 2014 సంవత్సరంలో అధికారం చేపట్టడానికి ముందు దేశంలో ధరలు పెరిగిపోతు న్నాయని, అవినీతి కుంభకోణాలు విపరీ తంగా జరుగు తున్నాయని నిరుద్యోగం పెరిగి చదువుకున్న వారికి ఉద్యోగాలు కల్పించడం లేదని తాను అధికారంలోకి వస్తే ఈ సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి పదేళ్ల గడుస్తున్న నేటికీ ఈ హామీల ▶మిగతా 3లో..

రాజమహేంద్రవరంలో

ఏలూరులో

జీవో నెంబర్ 77 వెంటనే రద్దు చేయాలి

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం/ఏలూరు : రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వసతి దీవెన డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ నాయక్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ 2100 కోట్లు, వసతి దీవెన రూ.1400 కోట్లు పెండింగ్‌లో ▶మిగతా 2లో..

రాజమహేంద్రవరంలో

మున్సిపల్ సిబ్బంది సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-ఏలూరు: రాష్ట్రంలో కార్పొరేషన్లలో, మున్సిపాలిటీలలో, నగర పంచాయతీలలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ విభాగం ఔట్సోర్సింగ్, కాంట్రాక్టు సిబ్బంది సమస్యలను, రెగ్యులర్ ఉద్యోగ సిబ్బంది సమస్యలను,ఎన్.ఎమ్.ఆర్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఇంజనీరింగ్ ఉద్యోగ సిబ్బంది ధర్నా చేసి కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఇచ్చిన రాష్ట్ర పిలుపులో భాగంగా ఏలూరులో ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు,ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ. అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పీహెచ్ ఔట్సోర్సింగ్ వర్కర్లకు రూ.21 వేలు జీతం చెల్లిస్తున్నారని, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ వారికి కేవలం రూ.15 వేలు చెల్లిస్తున్నారని విమర్శించారు. 2024 జనవరిలో పిహెచ్ ఔట్సోర్సింగ్ వర్కర్లకు పండగ మామూలుగా రూ.1000 చొప్పున ఇచ్చారని, సంవత్సరం గడుస్తున్నా ఇంజనీరింగ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్‌కు ఇవ్వలేదని పేర్కొన్నారు. వాటర్ వర్క్స్, వాటర్ సప్లై, స్ట్రీట్ లైటింగ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, కంప్యూటర్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్ గా పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందికి కనీస వేతనం రూ.32 వేలు నెలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బి. నాగేశ్వరరావు బి.నారాయణరావు, ఎస్.ఎన్.వి సుబ్బారావు, ఎం.దుర్గారావు, బి.పెద్దిరాజు, సోమేశ్వరరావు, ▶మిగతా 2లో..


జంగారెడ్డిగూడెంలో

బోట్లు సీజ్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం రూరల్ /కొవ్వూరు: రైలు కం రోడ్డు, గామన్ బ్రిడ్జి సమీపంలో ఇసుకను తీయరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని పాటించ కుండా ఇసుకను తరలిస్తున్న బోట్లు పై నిఘా ఏర్పాటు చేసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సీజ్ చేసినట్టు జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు పేర్కొన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్న రాముడు, మైన్స్ ఏ.డి, ఇతర అధికారులతో కలసి స్థానిక రోడ్ కం రైల్ బ్రిడ్జి సమీపంలోని దోబీ ఘాట్ వద్ద ఆకస్మిక తనిఖీ చేసి నిర్దేశించిన ప్రదేశాల్లో కాకుండా బ్రిడ్జి సమీపంలో ఇసుకను త్రవ్వి తరలిస్తున్న బోట్స్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నది ప్రాంతంలోని రైలు కం రోడ్డు, హేవ్లాక్, గ్రామన్ బ్రిడ్జి సమీపంలో ఇసుకను తీయ రాదనే నిబంధనలు ఉన్నప్పటికీ వాటికి విరుద్ధంగా అక్రమంగా ఇసుకను త్రవ్వి తరలిస్తున్న బోట్స్‌ను 18 సీజ్ చేసినట్టు పేర్కొన్నారు. ఇందులో రాజమహేంద్రవరం దోబీ వద్ద 8 బోట్లు, కొవ్వూరు వైపు ఏలినమ్మ ఘాట్ వద్ద 10 బోట్స్ ద్వారా అక్రమంగా ఇసుక ను తరలిస్తున్న బోట్లు మొత్తం 18 బోట్స్ ను సీజ్ చేశామని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ వెంట మైన్స్ ఏడీ డి. ఫణి భూషణరెడ్డి, ఏఈఈ జి. మణికంత రాజు, సర్వేయర్, శ్రీనివాసులు, సిబ్బంది, శ్యామ్, డీఈ ఇరిగేషన్ కె. ఆనంద్ బాబు తదితరులున్నారు.

పేద విద్యార్థికి మానవత ఆర్థిక సహకారం

విశాలాంధ్ర - పెదపాడు: కాలిన గాయాలతో బాధపడుతూ చికిత్స చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్న విద్యార్థికి పెదపాడు మానవతా స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకుంది. వివరాల్లోకి వెళితే... పెదపాడు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన హై స్కూల్ విద్యార్థి రాపాక ఇమ్మానుయేలు దేవదాసుకి

ప్రమాదవ శాత్తు కాలిన గాయాలు అయ్యాయి. ఇమ్మానియేల్ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. ఈ కారణంగా ఇమ్మానియేల్ ఇంటి వద్ద ఉండి కాలిన గాయాలతో బాధపడుతున్నాడు. పెదపాడు మానవత స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ రామకృష్ణ విషయం తెలుసుకున్నారు. సోమవారం ఇమ్మానియేల్ ఇంటికి వెళ్లారు. చికిత్స నిమిత్తం సంస్థ తరుపున 5000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థికి సహాయం చేశామని చెప్పారు. కార్యక్రమంలో పెదపాడు జెడ్పి హైస్కూలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ జగన్మోహనరావు మృతికి దేగా ప్రభాకర్ సంతాపం

విశాలాంధ్ర - ఏలూరు : సేవా తత్పరుడు,ఏలూరు నగరంలో పేద ప్రజల డాక్టర్ గా ఆరాధించే లయన్ డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు మృతికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. హేలాపురి లయన్స్ క్లబ్ ద్వారా గత 48సంవత్సరాలుగా ఏలూరు ప్రజలకే కాక లయనిజం ద్వారా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అనేక సేవా కార్య క్రమాలు నిర్వహించారని కొనియాడారు.డాక్టర్ జగన్మోహనరావు వామపక్ష భావజాలం కలిగి ఉండేవారని, పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అగ్రభాగాన ఉండేవారని తెలిపారు.విశాఖపట్నంలో లయన్స్ కాన్సర్ హాస్పిటల్ ఏర్పాటులో,విజయవాడలో లయన్స్ బ్లడ్ బాంక్ ఏర్పాటులో,దెందులూరులో లయన్స్ ఐ.టి.ఐ, ఏలూరులో కే ఏ హెచ్ ఎల్ డిగ్రీ కళాశాల నిర్మాణంలో వీరి కృషి మరువలేనిది అన్నారు.విద్య, వైద్య,సామాజిక సేవా రంగాలలో డాక్టర్ జగన్మోహన్ రావు అందించిన సేవలు అజరామరం అని కొనియాడారు.

విజిలెన్స్ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - ఉండి : విజిలెన్స్ కమిటీ ఉన్న సమావేశం ఏర్పాటు చేయడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఎండగండి వినియోగ దారుల సంఘం కార్యదర్శి పీవీఎస్ గోపాలకృష్ణరాజు విమర్శించారు. ఈ మేరకు ప్రజావాణిలో సోమవారం ఆయన ఫిర్యాదు చేశారు. రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్కు

తరలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసారని ఎద్దేవ చేశారు. విజిలెన్స్ కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం ఏర్పాటు చేయవలసి ఉండగా ఈ మధ్యకాలంలో కమిటీ సమావేశం ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. కమిటీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వినియోగదారులు, సభ్యులుగా ఉంటారని గుర్తు చేశారు. కమిటీకి సూచనలు సలహాలు ఇచ్చేందుకు తక్షణమే సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఉండి రైల్వే గేటు మూసివేత

విశాలాంధ్ర - ఉండి : ఈనెల 9 తేదీ నుండి 18 తేదీ వరకు ఉండి రైల్వే గేటు మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్లు ఉండి ఎస్సై మహమ్మద్ నసిరుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భీమవరం నుండి ఆకివీడు వెళ్ళవలసిన వాహనాలు పెద అమిరం కాళ్ల ఏలూరుపాడు మీదుగా ఆకివీడుకు, ఆకివీడు నుండి భీమవరం రావలసిన వాహనాలు ఏలూరుపాడు, కాళ్ళ మీదుగా భీమవరం, గణపవరం నుండి ఆకివీడు వెళ్ళవలసిన వాహనాలు పాముల పర్రు పెదకాపవరం మీదుగా ఆకివీడు వెళ్ళవలసి ఉంటుందని పేర్కొన్నారు. వాన దారులు సదరు విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు.

పరిష్కరించాలి (1వ పేజీ తరువాయి)

సిహెచ్ శ్రీనివాస్, సిహెచ్ హరినాథ్ బాబు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో: ఏపి. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర పిలుపులో భాగంగా ఏపి. మునిసిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా చేసి కార్మికుల సమస్యలపై మునిసిపల్ కమిషనర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్స్ అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం పుర పాలక సంఘంలో 25 సంవత్సరాల నుండి పారిశుద్ధ్య కార్మికులుగా, పంప్ ఆపరేటర్లుగా, ఇంజనీరింగ్ కార్మికులుగా పలు విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వాలు పాలకులు మారుతున్నారే తప్ప తమను ఎవరు పట్టించుకున్న పాపాన పోవడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. ఔట్సోర్సింగ్ కింద పనిచేస్తున్న కార్మికులందరికీ సమాన వేతనం ఇవ్వవలసి ఉండగా విభజించు,పాలించు అనే విధంగా పారిశుద్ధ్య కార్మికులకు రూ.21వేలు ఇస్తుండగా,మున్సిపాలిటీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.15వేలు వేతనం ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌర వ అధ్యక్షులు జంపన వెంకటరమణరాజు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కుంచె వసంతరావు, ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులు కంతేటి వెంకటరావు, కార్యదర్శి ఎన్ సుబ్బారావు ,పారిశుధ్య విభాగం కార్యదర్శి బొక్క శ్రీనివాస్, కొత్తూరి నాగేశ్వరరావు, ముప్పిడి శ్రీను,అయినాల ముత్యాలరావు, దోసూరి నాగరాజు, అప్పల స్వామి,కొత్తూరి ఏమిలేశ్వరరావు, ఇంగుర్తి నాగరాజు, యడ్లపల్లి ప్రసాద్, పొడుదోలు రమణ మునిసిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నరసాపురంలో : ఔట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల పెండింగ్ జీతాలపై ,అన్ని అవుట్ సోర్సింగ్ విభాగ కార్మికుల,ఆఫీస్ సిబ్బంది వేతనాల పెంపుకై గత ప్రభుత్వంలో అంగీకరించిన మినిట్స్ ను అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, పెండింగ్లో ఉన్న సరెండర్ లీవుల ఎన్‌క్యాష్ మెంటు విడుదల చేయాలని నరసాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు, సిపిఐ పట్టణ కార్యదర్శి ఆరేటి మృత్యుంజయ రావు ప్రసంగించారు. స్థానిక మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పేడారి విజయ్ కుమార్,నీలాపు ప్రసాద్ బాబు, గుమ్మడి శ్రీనివాస్, యార్లగడ్డ రాము, సింగంపల్లి అమరావతి, పేడారి సుజాత కుమారి, లూటుకుర్తి రత్తయ్య, యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

రద్దు చేయాలి (1వ పేజీ తరువాయి)

ఉన్నాయన్నారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు సంబంధించి నాలుగు క్వార్టర్ల రూపంలో డబ్బులు జమ అయ్యేవని, గత సంవత్సరం విద్యార్థులకు కేవలం ఒక క్వార్టర్ మాత్రమే విడుదలై మిగతా మూడు క్వార్టర్లు విడుదల కాలేదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు కట్టలేక సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. గతంలో వైయస్సార్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో విద్యార్థులకు పెద్దపీట వేస్తాను విద్యార్థుల చదువు భవిష్యత్తు అంతా నాదే అని చెప్పిన జగన్ దాదాపు 5 సంవత్స రాలలో 3500 కోట్లు విద్యార్థుల సొమ్ము ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు. ప్రస్తుత అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వమైనా గత ప్రభుత్వం మాదిరికాకుండా తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ వసతి దీవెన, డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం విడు దల చేసి విద్యార్థుల కష్టాలు తీర్చాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి. శ్రీనివాస్, డి. సుమన్, కుమార్, ఎం సతీష్, టి మహేష్, కే వెంకట్,, ఎం సంతోష్, కుమార్, ఎస్. కృపా, రవికిరణ్, వి.యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, వసతి దీవెన నగదు విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఏలూరు కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. శివ కుమార్,జిల్లా కార్యదర్శి యర్రా మధు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ రూ.2100 కోట్లు, వసతి దీవెన రూ.1400 కోట్లు పెండింగ్ లో ఉన్నాయని,తక్షణమే ఈ బకాయిలు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 9.5 లక్షల మంది విద్యార్థులు డిగ్రీ ఇంజనీరింగ్ పీజీ విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఒక క్వార్టర్ ఫీజు 708 కోట్లు విడుదల చేశారన్నారు.3 క్వార్టర్లకు సంబంధించి దాదాపు రూ.2100 కోట్లు విడుదల చేయలేదన్నారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు కూడా వచ్చే నెల నుంచి డిగ్రీ ఇంజనీరింగ్ పరీక్షలు మొదలవుతున్నాయని, వాటికి గతంలో పెండింగ్లో ఉన్న డబ్బులు చెల్లిస్తేనే మీకు పరీక్షలకు అనుమతి ఇస్తామని కళాశాల యజమానులు తెలియజేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రియంబర్స్మెంట్‌కు వసతి దీవెనకి అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పరీక్షలు రాసేందుకు అనుమతించాలని, వారి సర్టిఫికెట్లు కూడా విద్యార్థులకు అందజేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. క్రాంతి కుమార్, యు.రవి, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్నవ యామినికి అభినందనలు

విశాలాంధ్ర-కామవరపుకోట: భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ సమితి సభ్యురాలిగా ఏపి. మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని ఎన్నికైన సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు సోమవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, మహిళా సమాఖ్య మండల నాయకులు తల్లి బోయిన రాములమ్మ,పెండ్లి నాగమణి, బలుసుపాటి రత్నకుమారి, తదితరులు భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ సమితి సభ్యురాలుగా ఎన్నికైన మనవ యామినికి శు భాకాంక్షలు తెలిపారు.

మన్నవ యామిని ఎంపికపై హర్షం

విశాలాంధ్ర - కుక్కునూరు: భారత జాతీయ మహిళా సమాఖ్య సభ్యురాలిగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని ఎంపికపై సీపీఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.ఆమె భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు చేపట్టాలని ఈ సందర్భంగా కోరారు.జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య,కూరాకుల బాబూరావు,నకిరికంటి. నాగరాజు తదితరులు యామినికి హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు

క్రీస్తు జననం ప్రపంచానికి శాంతి మార్గం

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: క్రీస్తు జననం ప్రపంచానికి శాంతి మార్గాన్ని చూపించిందని జాతీయ వాక్యోపదేశకులు పాస్టర్ ఎస్. ప్రేమ రాజు తెలిపారు. బుట్టాయిగూడెం మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపిఫ్ ప్రాంగణంలో సెమీ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమరాజు మాట్లాడుతూ క్రీస్తు ఈ లోకంలో జన్మించి సర్వ మానవాళికి ప్రేమ, సత్య మార్గాలను చూపించారని, ఆయన బోధనలను అనుసరించి జీవించాలని పేర్కొన్నారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని కేక్ కటింగ్ చేసి విశ్వాసులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బుట్టాయిగూడెం మండల పాస్టర్ ఫెలోషిప్ సభ్యులకు సాయిస్ఫూర్తి హాస్పటల్ ఎండి ఎన్ శ్రీనివాసరావు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిఎఫ్ అధ్యక్షులు పి దావీదు, ఉపాధ్యకులు జె. యోసోబు, సెక్రటరీ కె. దానియేలు, పాస్టర్లు పోలోజు దావీదు, పి. కుమార్ పాల్, జార్జిముల్లర్, షేక్ పాల్, ఎం జోసెఫ్, సిహెచ్ అలెగ్జాండర్, వై దేనియల్ రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల నిర్వహణపై సర్వే

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలోని మధ్య తరహా,చిన్న తరహా పరిశ్రమల పనితీరుపై సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వాణి తెలిపారు. ధర్మాజీగూడెంలో జరుగుతున్న ఈ సర్వే ను సోమవారం తనిఖీ చేశారు. ఈ పరిశ్రమలు పనిచేస్తున్న తీరును, పరిశ్రమల నిర్వాహకుల ఆర్థిక పరిస్థితులను సర్వే

ద్వారా తెలుసుకుంటు న్నట్లు వివరిం చారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా సర్వే జరుగుతుందని తెలిపారు. సచివాలయాలలో పనిచేసే ఇంజనీరింగ్ సిబ్బందిని సర్వేకి నియమించామని పరిశ్రమలు నిర్వహించే వారంతా వీరికి సహకరించాలని తెలిపారు.బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని పరిశ్రమలో నెలకొల్పినవారు రుణాల చెల్లింపు వివరాలను సర్వేలో నమోదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయో తెలుసుకుంటున్నట్లు తెలిపారు.చేసిన సర్వే రిపోర్టులను కలెక్టర్ వెట్రి సెల్వికి అందజేస్తామని అన్నారు.

విచారణ చేపట్టాలి

(1వ పేజీ తరువాయి)

అమలుకు మోడీ ప్రభుత్వం ఏమాత్రం చర్యలు చేపట్టకపోవ డం దారుణమని విమర్శించారు.పదేళ్ల పరిపాలనలో దేశంలోని ధరలను అదుపు చేయడంలో, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, నరేంద్ర మోడీ పూర్తిగా వైఫల్యం చెందారని మండిపడ్డారు. ఇప్పటికైనా బిజెపి నరేంద్ర మోడీ తాము చెప్పిన హామీల అమలకు తక్షణమే చర్యలు చేపట్టాలని లేని పక్షంలో ప్రజలను సమీకరించి భవిష్యత్తులో ఈ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏరియా సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్,జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కే.కృష్ణమాచార్యులు,సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బళ్ల కనకదుర్గారావు,భజంత్రీ శ్రీనివాసరావు,యర్రా మధు, అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, మావూరి విజయ,ఎం.ఏ హకీం,నాగం అచ్యుత్,గన్ను వెంకటరావు, కొల్లూరి సుధారాణి, తెర్లాపు శ్రీను,శాయన అభిలాష్ కుమార్,నరేష్, కొండేటి మేరీ,ఉప్పులూరి లక్ష్మి, భవాని, కొండేటి రాజేష్, టి.లక్ష్మి, టి.దుర్గా, ఎ.గంగ,జె.దుర్గ, శాంతి, కుమారి, మూర్తి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో : అదాని అవినీతి జాయింట్ పార్లమెంట్ కమిటీచే విచారణ జరిపించాలని, మణిపూర్ హింసకాండను అరికట్టాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆకాశాన్నంటుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమరావు డిమాండ్ చేశారు. సీపీఐ జాతీయ సమితి పిలుపుమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఉండి కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు ఆధ్వర్యంలో సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోనాల మాట్లాడుతూ అమెరికా నిఘా సంస్థలు 2,100 కోట్లు సోలార్ విద్యుత్ కొనుగోలు విషయంలో లంచాల రూపంలో చేతులు మారినట్లు నిగ్గు తేల్చేయని అన్నారు. ఆనాటి వైసిపి ప్రభుత్వానికి 1750 కోట్లు లంచాల రూపంలో ముడుపులు చెల్లించారని పేర్కొన్నారు. అదానిపై చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. మణిపూర్ లో జరుగుతున్న హింసాకాండను అరికట్టటంలో మోడీ పూర్తిగా విఫలమైందన్నారు. మోడీకి విదేశాల్లో పర్యటించడానికి సమయం ఉంది కానీ మణిపూర్ లో పర్యటించడానికి తీరిక లేదా అని ప్రశ్నించారు. అక్కడ జరుగుతున్న హింసకాండను అరికట్ట లేరా అని ఎద్దేవ చేశారు. నిరుద్యోగ యువతకు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కోటి ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని విమర్శించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినత పత్రాన్ని తహసీల్దార్ కావిడి నాగార్జునకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు సన్నపాల శ్రీను, జిల్లా మహిళా సంఘం కార్యదర్శి చిక్కి లే పుష్పకుమారి, సిపిఐ శాఖ కార్యదర్శులు కోన గొల్లయ్య, కర్రీ సూరిబాబు, ఉండి భద్రరావు, దువ్వరి రాజు గోపాల్ కృష్ణ, పున్నాని అప్పారావు, బైరెడ్డి వెంకట్రావు, లంక సీతమ్మ, అనిపె లక్ష్మి, తమ్మరాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో :అదానీ గ్రూప్ కంపెనీల అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని,గత రాష్ట్ర ప్రభుత్వం ఆదానీ కంపెనీలతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఐ జంగారెడ్డిగూడెం

మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్ లో జరుగుతున్న హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరపాలని, అధిక ధరలను అరికట్టాలని, భారతదేశంలో నిరుద్యోగం నిర్మూలించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కుంచె వసంతరావు, సుంకర రాధాకృష్ణ, వద్దమనాటి శ్రీను,జగన్నాధ కృష్ణ, కూన పాముల విఘ్నేష్, బొక్కా శ్రీను, కొత్తూరు నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో: అదానీ అవినీతి కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని, అదానీతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దుచేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు.

భీమవరంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన మాట్లాడుతూ విద్యుత్ ఒప్పందాల కోసం రూ. 2100 కోట్లు నాలుగు రాష్ట్రాలకు అదానీ లంచాలుగా ఇచ్చినట్లు వచ్చిన ఆరోపణలపై నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించాలని ఆయన పేర్కొన్నారు. మణిపూర్ హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరపాలని, రాష్ట్ర ప్రజలపై పడే విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాలా త్రిమూర్తులు, పి. యాకోబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్‌లో : అదాని అవినీతి చర్యలను ప్రోత్సహిస్తున్న కేంద్రంలోని పెద్దలు తక్షణమే గద్దె దిగాలని సీపీఐ భీమవరం మండలం కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ డిమాండ్ చేశారు. అదాని ఒప్పందాలపై దర్యాప్తు జరిపించాలని సిపిఐ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం భీమవరం రూరల్ మండలం కమిటీ

ఆధ్వర్యంలో నాగిడిపాలెం హైవే వంతెన వద్ద సిపిఐ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల సీతారాంప్రసాద్ మాట్లాడుతూ అదానీ ఒప్పందం వల్ల రాష్ట్రంలో విద్యుత్ రంగంలో అవినీతి పెరిగిపోయిందని అంతిమంగా ప్రజలపై పెనుభారం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, నిరుద్యోగ సమస్యను నిర్మూలించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తిరుమని కామేశ్వరరావు, శాఖ కార్యదర్శి నాగిడి నాగరాజు, నాగిడి సత్యనారాయణ నాయుడు గోవిందు, నాయుడు గోపి, మోకా రామకృష్ణ, వల్లభాని చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో : ఆదాని కంపెనీలతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని సిపిఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఆదాని ఒప్పందాలు రద్దు చేయాలని చింతలపూడి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం

తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానితో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, అదానిపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ వేయాలని, మణిపూర్ ఘటనపై పార్లమెంట్లో చర్చ జరగాలని, రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ ధర్నాలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు,దొంతా కృష్ణ ఎస్కే జానీ, ఎస్కే కాలేశా, తాడిగడప మాణిక్యాలరావు, తక్కిలపాటి ప్రసాద్ రావు, ముహూర్తా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో : కుక్కునూరు ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు.గంటపాటు ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి,జిల్లా సమితి సభ్యులు కొన్నె లక్ష్మయ్య

పాల్గొని మాట్లాడారు.గత ప్రభుత్వంతో అదానీ గ్రూప్ చేసుకున్న చీకటి ఒప్పందాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కోరుతూ.. నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు కూరాకుల బాబూరావు,నకిరికంటి. నాగరాజు,వంజం విజయ్, సోయం మారయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో: ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ అవినీతి ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని సిపిఐ మండల కార్యదర్శి కళింగ లక్ష్మణరావు పేర్కొన్నారు. పెంటపాడు మండల కేంద్రంలో సిపిఐ పెంటపాడు మండల సమితి ఆధ్వర్యంలో గేట్ సెంటర్లో సోమవారం నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ ఈశాన్య ప్రాంతమైన మణిపూర్లో శాంతిభద్రతలు విఘాతం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పెంచి పోషిస్తుందని,కనీసం ఎంతో ప్రాణ,

ఆస్తి నష్టం జరిగినా ఇప్పటివరకు ప్రధానమంత్రి మణిపూర్ వెళ్లలేదని ఆయన విమర్శించారు. 2014 తర్వాత ప్రస్తుతం వరకు నరేంద్ర మోడీ ప్రభుత్వం నిత్యావసర వస్తువులు ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు,గ్యాస్ ధరలు,విద్యుత్ ఛార్జీలు కార్పొరేటర్లకు అనుకూలంగా,రాష్ట్ర ప్రభుత్వాన్ని లొంగదీసుకునే విధంగా విద్యుత్ భారాలు మోపుతున్నారని తీవ్రంగా విమర్శించారు.

ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు,దిద్దే నాగేశ్వరావు,కొణతాల నాగరాజు, యుజ్జల పండు, ఉయ్యూరు సత్యనారాయణ, టి.రాంబాబు,టి.పవన్ కుమార్,ఎర్ర రామకృష్ణ, సతీష్, పి.లక్ష్మయ్య సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో : పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో జాతీయ రహదారిపై సిపిఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జమ్మి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదాని గ్రూప్ కంపెనీల అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు

చేయాలని, మణిపూర్లో జరుగుతున్న హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరపాలని అన్నారు.గత వైసిపి ప్రభుత్వ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా ఉన్నాయని, వాటిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరల తగ్గింపునకు చర్యలు తీసుకుంటామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, చెక్కిరెడ్డి సోమరాజు,కట్ట మహా లక్ష్మయ్య, బొబ్బర యేసు,రాంబాబు, లక్ష్మణరావు,మట్ట రామకృష్ణ, పురిటి గద్ద వెంకటేష్, ప్రత్తిపాటి గంగరాజు,వెలగ నాని, బొబ్బర రమేష్, వెలగల రామారావు,తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలిచేది ఎర్రజెండా

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజల పక్షాన నిలిచేది ఎర్రజెండా మాత్రమేనని సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ పేర్కొన్నారు.సిపిఐ 22వ డివిజన్ శాఖ సమావేశం సోమిశెట్టి నాగలక్ష్మి అధ్యక్షతన యర్రగడ్డ జగన్ మోహన్ రావు వీదిలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న హేమ శంకర్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ దేశంలో 100 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటుం దన్నారు. వందేళ్ల పార్టీ పోరాట చరిత్రలో అనేక ఉద్యమాలు విజయం సాధించిన ఘనత సిపిఐ సొంతమని కొనియాడారు. దున్నేవాడికే భూమి కావాలనే నినాదంతో లక్షలాది ఎకరాల భూమిని దేశవ్యాప్తంగా పేదలకు పంచిన ఘనత సిపిఐ కి మాత్రమే చెల్లిందని తెలిపారు. సిపిఐ సిద్ధాంతాలను, ఉద్యమాన్ని మరింతగా ప్రజల్లో ప్రచారం చేసి వారి హక్కులకై ప్రజలంతా పోరాడే విధంగా చైతన్య పరచాలని సభ్యులకు పిలుపునిచ్చారు.

అనంతరం 22వ డివిజన్ శాఖ నూతన కార్యదర్శిగా సోమిశెట్టి నాగలక్ష్మి, సహాయ కార్యదర్శిగా తిరుమలశెట్టి జానకిని ఏకగ్రీవంగా సమావేశం ఎన్నుకుంది.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కొండేటి బేబి,ఏలూరు కార్యవర్గ సభ్యురాలు అడ్డగర్ల లక్ష్మీ ఇందిరా, శాయన అభిలాష్ కుమార్, తిరుమల శెట్టి శివకుమారి, గిడుతూరి కవిత,తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలో పురుడు పోసుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పురుడు పోసుకోవాలని పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె. ప్రియాంక అన్నారు సోమవారం గణపవరం మండలం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణిలకు ప్రధానమంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమం డాక్టర్ కె. ప్రియాంక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు శ్రేయస్కరమన్నారు. ప్రతి గర్భిణీ స్త్రీ 7,8,9 నెలలులో తప్పనిసరిగా ప్రతినెల 9వ తేదీన నిర్వహించే పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో బి. పి, షుగర్, హిమోగ్లోబిన్, చేయించుకోవాలని డాక్టర్ సలహా మేరకు ఏరియా హాస్పటల్ లో పరీక్షలు చేయించుకోవాలని తెలియ జేశారు. ఈకార్యక్రమంలో ఎం పి హెచ్ ఓ జి వెంకటేశ్వరరావు, పీ పీహెచ్ఎన్ అన్నాకుమారి, హెచ్ వి టి సుబ్బలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, స్టాఫ్ నర్స్లు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రజా సమస్యల పరిష్కారం తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం పలు సమస్యలతో కార్యాలయానికి వచ్చిన ప్రజలతో మమేకమై వారి సమస్యలు తెలుసుకుని త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వివరించారు. ఆయన వెంట అడపా ప్రసాద్, పై బోయిన వెంకటరామయ్య, పాలూరు వెంకటేశ్వరరావు,చాపల రమేష్, బయనపాలేపు ముఖేష్ తదితరులు ఉన్నారు.

రాజకుమార్‌కు అంబేద్కర్ జాతీయ పురస్కారం

విశాలాంధ్ర- భీమవరం టౌన్: భారతీయ దళిత సాహిత్య అకాడమీ న్యూ ఢిల్లీ లో ఆదివారం జరిగిన 40 వ వార్షికోత్సవంలో భీమవరంకు చెందిన కొండాపు ఫ్రాన్సిస్ రాజకుమార్ డా. బి.ఆర్ అంబేద్కర్ జాతీయ పురస్కారం అందుకున్నారు. ఆయన డా బి. ఆర్. అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకు వెళుతూ దళితుల అభ్యున్నతికి అనేక రచనలు చేసిన ఆయన కృషికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నేషనల్ ఫెలో షిప్ అవార్డు భారతీయ దళిత సాహిత్య అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్ పి సుమనక్షర్ చేతుల మీదుగా అందుకున్నారు. రాజ్ కుమార్ కు అవార్డు రావటంతో పలువురు దళిత నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఒక రోజు వాయిదా పడిన రెవెన్యూ సదస్సు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో రెవెన్యూ సదస్సు ప్రారంభం ఒక రోజు వాయిదా పడినట్లు తహసిల్దార్ నజీమ్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారుల ఆదేశాలను అనుసరించి బుధవారం నుంచి ఈ సదస్సులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఈ సదస్సులు జనవరి 8 వరకు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాలలో ఉన్న భూముల వివాదాలను ఈ సదస్సుల ద్వారా అక్కడకక్కడే పరిష్కారం చేస్తామని ప్రతి ఒక్కరు ఈ సదస్సును వినియోగించుకోవాలని తహసిల్దార్ కోరారు.

కరాటే విజేతలకు కలెక్టర్ అభినందనలు

విశాలాంధ్ర -భీమవరం: కరాటే విద్యలో మరింతగా రాణించి జిల్లాకు ప్రపంచ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఇటీవల మలేషియాలో నిర్వహించిన కరాటే పోటీల్లో మూడు పతకాలు సాధించిన భీమవరం విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వారితో కొద్దిసేపు ముచ్చటించి ఎక్కడ చదువుతున్నారు, ఏం చదువుతున్నారు, ఇంతకు ముందు ఎన్నిసార్లు విజయం సాధించారు, తదితర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి జిల్లా కలెక్టర్‌కు వివరిస్తూ మలేసియా దేశంలో జరిగిన కరాటే పోటీల్లో ఈ ముగ్గురు విద్యార్థులతో పాటు 11 దేశాల్లోని 16 మంది ఎంపిక అయ్యారని, వారిలో ఈ ముగ్గురు విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలను నేతల అశ్విని, దండే ప్రియ, బత్తుల జెస్సీ లు సాధించారని వీరందరూ ఇమ్మానుయేల్ చిల్డ్రన్ హోమ్ లో వసతి పొందుతున్నట్లు తెలిపారు. వీరు 9, 10 తరగతి లను భీమవరంలోని ఎస్ జె జి ఎం హై స్కూల్ నందు చదువుచున్నట్లు వివరించారు.

కరాటేలో మెడల్స్ సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. కార్యక్రమంలో ఇమ్మానుయేలు చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు ఎన్‌ఎస్ పాల్ పాల్గొన్నారు.

ఏపీలో 36 కేంద్రీయ విద్యాలయాలు, 15 జవహర్ నవోదయ విద్యాలయాలు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: కేంద్రీయ విద్యాలయ సంఘటన్ (కెవిఎస్) సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొత్తగా 8 కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందాయని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 36 కేంద్రీయ విద్యాలయాలు, 15 జవహర్ నవోదయ విద్యాలయాలతో సహా దేశవ్యాప్తంగా 1253 కేంద్రీయ విద్యాలయాలు, 653 నవోదయ విద్యాలయాలు పనిచేస్తున్నాయని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి ప్రకటించారు. కేంద్రీయ విద్యాలయాలు (కెవి), జవహర్ నవోదయ విద్యాలయాలు (జెఎన్‌వి) ఏపీతో పాటు దేశవ్యాప్తంగా ఎన్ని పనిచేస్తున్నా యని, కొత్తగా ఏర్పాటు చేయదానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో సోమవారం అడిగిన ప్రశ్నకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు.

జాతీయ విద్యా విధానంతో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

మణిపూర్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సోమయాజులు

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: జాతీయ విద్యా విధానం -2020లోని సరికొత్త ఫీచర్స్‌తో విద్యార్థుల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్ద వచ్చని మణిపూర్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డివిఎల్ఎన్ సోమయాజులు సూచించారు. ఏపీ నిట్ ఆధ్వర్యంలో జాతీయ విద్యా విధానం - 2020 ప్రాముఖ్యత, విద్యా విధానంలో కృత్రిమ మేధ కృషి అనే అంశంపై ఆచార్యులకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ ఆచార్యులు, డాక్టర్ ఎన్.వి.రమణా రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి సోమయాజులు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ రోజుకో కొత్తరకం యాప్ లు, పరికరాలు పరిచయం అవుతున్నాయని తెలిపారు. ఫ్లికర్స్ యాప్, ఈడి ఫజిల్, క్విజిస్, గామా, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ రూపొందించిన అనువాదిని వంటి యాప్ లను బోధనా విధానంలో అమలుచేయటం వల్ల మెరుగైన ఫలితాలను సాధించవచ్చన్నారు. పెన్ను, పేపర్ లేకుండానే విద్యార్థుల సామర్థ్యాలను తరగతి గదిలోనే తెలుసుకునేందుకు ఈ యాప్ లు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు . వరంగల్ నిట్ ఈసీఈ విభాగం ఆచార్యులు, తిరుచ్చిరాపల్లి ఐఐటి ఫార్మర్ డైరెక్టర్, డాక్టర్ ఎన్.వి.ఎస్.ఎన్.శర్మ మాట్లాడుతూ ఆచార్యులు, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేరీతిలో పాఠ్యాంశాలను బోధించాలని చెప్పారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమయంలో విద్యార్థులను ప్రశ్నించడంతోపాటు సరైన చిత్రాల సహాయంతో పాఠాలను చెప్పటం ద్వారా విద్యార్థులకు ఎక్కువ కాలం గుర్తుండే అవకాశాలున్నాయని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ఇంచార్జ్ డైరెక్టర్, ఆచార్యులు, డాక్టర్ ఎన్.వి.రమణారావు మాట్లాడుతూ ఆచార్యులు బోధనా పద్ధతులను మరింత మెరుగ్గా తీర్చిదిద్దుకునేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. అతిథులను నిట్ ఇంచార్జ్ డైరెక్టర్ రమణారావు జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీన్ లు డాక్టర్ జీఆర్కె శాస్త్రి, డాక్టర్ టి టి.కురుమయ్య, డాక్టర్ జీబి వీరేష్ కుమార్, డాక్టర్ ఎన్.జయరామ్, అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు.

వృద్ధాల రవాణాపై కేసు నమోదు

విశాలాంధ్ర-భీమడోలు: కోడి మాంసపు వ్యర్థాలు అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం అందుకున్న భీమడోలు పోలీసులు మధ్యవర్తులను తీసుకొని పూళ్ళ గ్రామం వంతెన వద్దకు వెళ్లి నిర్వహించిన వాహన తనిఖీలు చేశారు. నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామానికి చెందిన జల్లూరి సుబ్బరాజు తన సొంత బొలెరో వ్యాన్ నెంబర్ ఏ.పి.39వి.ఎ. 2691 లో రాజమండ్రి పరిసర ప్రాంతాల నుంచి కోడి మాంసపు వ్యర్థాలను సుమారు 1.5 టన్నులు లోడ్ చేసుకుని తోకలపల్లి గ్రామంలో తాను సాగు చేస్తున్న చేపల చెరువులకు మేతగా వేయడానికి వెళుతున్నట్లు చెప్పగా భీమడోలు పోలీసు వారు ఆ వాహనాన్ని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం :పేద విద్యార్థినికి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని రామిరెడ్డి అందజేశారు. మండలంలో పొంగుటూరు గ్రామానికి చెందిన నక్క మమత స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి విద్యను అభ్యసిస్తోంది. మమతకు ఆర్థిక ఇబ్బందులు ఉండడం వలన విద్యార్థిని తల్లి పదవ తరగతి చదివిన తర్వాత చదువును నిలిపివేస్తామని తెలపడంతో, విషయం తెలుసుకున్న ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంకు కొండలరావు, విద్యార్థిని స్థితి తెలుసుకొని ఆయన మిత్రుడు ఆస్ట్రేలియాలో ఉంటున్న శ్రీ రామిరెడ్డికి విషయం తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి విద్యార్థిని చదువు నిమిత్తం ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని విద్యార్థిని తల్లికి అందజేశారు. విద్యార్థిని మమత చదువులో ముందుంటుందని, అత్యధిక మార్కులు కూడా పాఠశాలలో నిర్వహించే పరీక్షలలో సంపాదించు కుంటుందని కొండలరావు తెలిపారు. విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - నిడమర్రు: క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు నిర్వహించుకోవాలని ఉంగుటూరు మాజీ శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) అన్నారు.

సోమవారం నిడమర్రు మండలం తోకలపల్లి గ్రామంలో నిడమర్రు మండలానికి సంబంధించి యుపిఇఫ్ సేవకుల ఐక్య క్రిస్మస్ వేడుకలో పాల్గొన్నారు.

వాసు బాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత భక్తిశ్రద్ధలతో పారవశ్యంతో జరుపుకొనే పండుగ క్రిస్మస్, ప్రపంచంలోని క్రైస్తవులంతా మనస్ఫూర్తిగా సంతోషంతో జరుపుకునే పండుగ అని తెలిపారు. అనంతరం సంఘ పెద్దలతో కలిసి కేక్ కటింగ్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిడమర్రు మండల జెడ్పీటీసీ సభ్యులు కోడే కాశీ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరు ప్రశాంతి, జేసీ చిన్న రాముడు

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : రానున్న రెండు రోజుల్లోవర్షాలు కురుస్తానే వాతావరణ శాఖ హెచ్చరిక ఆదేశాలు నేపథ్యంలో జిల్లాలో రైతులను అప్రమత్తం చేశామని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రశాంతి జాయింట్ కలెక్టర్ చిన్నరాముడుతో కలిసి పాత్రికే యుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ రానున్న రెండు రోజుల్లో వర్షాలు కురుస్తానే వాతావరణ శాఖ హెచ్చరిక ఆదేశాలు నేపథ్యంలో జిల్లాలో రైతులను అప్రమత్తం చేశామన్నారు. రైతులు ధాన్యం తడిసిపోకుండా అవసర మైన 10 వేల ఒక వంద టర్పా లిన్లి సిద్ధం గా ఉంచామన్నారు. రైతుల వద్ద 600 , బహిరంగ మార్కెట్లో 14 వేల టర్పాలిన్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలోని 18 మండలాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 221 రైతు సేవా కేంద్రాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయగా, ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా జిల్లాలో 2.30 మెట్రిక్ లక్షల టన్నులు ధాన్యం కొనుగోలు లక్ష్యానికి , ఇప్పటివరకు 209 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ. 467.30 కోట్ల రూపాయల విలువ గల 2 లక్షల 03 వేల 256 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 25,365 మంది రైతుల నుండి కొనుగోలు చేశామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 91 శాతం మంది రైతులకు 48 గంటలలోపు రు. 420. 63 కోట్ల రూపాయలను వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. తుఫాను, వర్షాలను దృష్టిలో ఉంచుకొని క్షేత్రస్థాయిలో రైతులకు ధాన్యం తడవకుండా టార్పాలిన్స్ అందించే దిశగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లాలో రైతుల నుండి మిల్లులకు ధాన్యాన్ని తరలించేందుకు 2 వేల సుమారు వాహనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 54 లక్షల గన్ని బ్యాగ్‌లను పిపిసి సెంట్రల్ అందించామన్నారు. అనంతరం ఉచిత ఇసుక సరఫరా పై మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలించే వారిపై కఠిన చర్య లు తీసుకోంటామని ప్రతి ర్యాంప్ కేంద్రంలోనూ 24 గంటలు సీసీ కెమెరాలతో నిఘా పర్యవేక్షణ ఉందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ టి.రాధిక తదితరులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్‌లో మెరిసిన కడియం విద్యార్థులు

విశాలాంధ్ర - కడియం : జాతీయ కళా ఉత్సవ్ 2024 పోటీల్లో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో బొమ్మూరు డైట్ కాలేజీలో ఆరు విభాగాల్లో పోటీల్లో నిర్వహించగా, మూడు విభాగాల్లో కడియం విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి సత్యనారాయణ తెలిపారు. వి గాయత్రి నాగదేవి జానపద గేయాల విభాగంలో ద్వితీయ స్థానం, వై సత్యసాయి మోహన పవిత్ర జానపద నృత్యం విభాగంలో తృతీయ స్థానం, షేక్ షరీన్ వాయిద్య సంగీత విభాగంలో తృతీయ స్థానం, చిత్రలేఖనంలో షేక్ అబ్దుల్ రహీంకు కన్సిలేషన్ బహుమతి గెలుచుకున్నారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, రఫీయుద్దీన్, రామకృష్ణంరాజు, శ్రీవెంకట దుర్గ, శరత్‌బాబు, సువర్ణవేణి, సూరిబాబు తదితరులు అభినందించారు.

ఎమ్మెల్యే నల్లమిల్లిని కలిసిన కోటపాడు ఫిషర్మెన్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు

విశాలాంధ్ర - అనపర్తి : కోటపాడు ఫిషర్మెన్ సొసైటీ అధ్యక్షునిగా ఎన్నికైన కాపరపు అప్పారావు, కార్యదర్శి దాసరి గోపి, సభ్యులు శేఖర్, బ్రహ్మాజీ, శ్రీను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం రామవరంలో కోటపాడు ఫిషర్మెన్ సొసైటీ నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యే నల్లమిల్లిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షులు అప్పారావు, కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే నల్లమిల్లి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గంగాధర్,అబ్బు, మురళి, రాజు, ఎన్ డి ఏ నేతలు ఉన్నారు.

రబీలో ఈ పంట నమోదు తప్పనిసరి

విశాలాంధ్ర - సీతానగరం: రైతులకు రబీలో ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏడీఏ మల్లికార్జునరావు అన్నారు. మండలంలో రఘుదేవపురం గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం రబీలో ఈ పంట నమోదును ఏ డీ ఏ మల్లికార్జున రావు, ఇంచార్జి ఏ ఓ తులసి దగ్గర ఉండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మల్లికార్జున రావు మాట్లాడుతూ రైతులు చాలా వరకు ఖరీఫ్ సీజన్ ముగించుకొని రబీ సీజన్లో అడుగు పెట్టి నాట్లు వేయడం జరిగింది అని అన్నారు. కావున మీ మీ గ్రామాలలో ఉన్న వ్యవసాయ అధికారి చేత మీ వేసిన పంటలకు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ పంట నమోదు చేయించుకొంటేనే ప్రభుత్వ అందించే ప్రోత్సాహకాలు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మీ పంటను అమ్ముకోవచ్చు అని అన్నారు. కావున పంట వేసిన ప్రతి ఒక్క రైతు మీ పంటను నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఏ చేతన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలికను 6 గంటల్లో అప్పగించిన పోలీసులు

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : తప్పిపోయిన 15 సంవత్సరాల బాలికను కిర్లంపూడి పోలీసులు 6గంటల్లో వారి తల్లితండ్రులకు అప్పగించారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి ఒక బాలిక కనిపించ కుండా పోవడంతో 10 గంటలకు వారి తల్లితండ్రులు రిపోర్టు ఇచ్చారు. తక్షణమే కేసు నమోదు చేసిన పోలీసులు 6 గంటల్లో ఆ కేసును ఛేదించారు.

పలువురికి మంత్రి దుర్గేష్ పరామర్శ

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం పరామర్శించారు. పాలంగి కి చెందిన ప్రగడ లక్ష్మీనారాయణ, మాదాసు నాగేంద్ర, వెలగదుర్రు గ్రామానికి చెందిన యాతం వెంకటేష్ ల ఇళ్లకు వెళ్లి, వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఉండ్రాజవరం జనసేన పార్టీ అధ్యక్షులు వీరమళ్ళ బాలాజీ, కే సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, ఎంపిటిసి కరుణాకర్, నిమ్మల సాంబమూర్తి తదితరులు ఉన్నారు.

బాపనదారలో ఆవు దూడపై పెద్దపులి దాడి

- పెద్దపులి సంచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- డీఎఫ్ఓ రవీంద్రనాథ్ రెడ్డి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : అటవీ సమీప ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు పెద్దపులి సంచారంపై అప్రమత్తంగా ఉండాలని కాకినాడ డిఎఫ్ఓ డి రవీంద్ర నాథ రెడ్డి తెలియజేశారు. ఈనెల 7న మండలంలోని బాపన్నదార గ్రామానికి సమీపంలో అడవిలో ఒక ఆవు దూడను చంపి తిన్నట్టుగా ఫారెస్ట్ సిబ్బందికి సెల్ ఫోన్ ద్వారా గ్రామస్తులు సమాచారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఏలేశ్వరం ఫారెస్టు రెంజ్ ఆఫీసరు కె దుర్గారాంప్రసాద్, డిప్యూటీ రెంజ్ ఆఫీసరు యమ్ జాన్సన్, మరియు ఏలేశ్వరం అటవీ సెక్షన్ సిబ్బంది కలిసి సంఘటన స్థలానికి చేరుకొని దూడను చంపిన ప్రదేశము చుట్టూ 4 ట్రాప్ కెమెరాలు అమర్చడం జరిగిందన్నారు. అటవి శాఖ సిబ్బంది 8,9 తేదీల్లో ట్రాప్ కెమెరాలను పరిశీలించగా ఎటువంటి పులి ఫోటోలు రికార్డు అవ్వలేదన్నారు. తదుపరి సదరు ప్రాంతములో అనుమానిత జంతువు యొక్క పాద ముద్రలు (పిఓపి) సేకరించి, నిపుణులతో పరీక్షించగా పాదముద్రల పరిమాణాన్ని బట్టి అవి పెద్దపులి యొక్క పాద ముద్రలుగా నిర్ధారణ అయిందన్నారు. గత వారం రోజులుగా అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి అటవీ క్షేత్ర పరిధిలో సంచరిస్తూ ఇటువైపున ఏలేశ్వరం అటవీ క్షేత్ర పరిధిలోనికి వచ్చినట్లుగా అనుమానిస్తున్నామన్నారు. సంఘటనా ప్రాంతానికి చేరుకోవడానికి సరైన మార్గము లేనప్పటికి అటవి సిబ్బంది అతి కష్టము మీద సంఘటన ప్రాంతమునకు చేరుకొని పెద్దపులి కదలిక విషయమై సమాచారము సేకరణ కొరకు ప్రయత్నిస్తున్నారు. దారపల్లి, కొండపల్లి, బాపన్నదార, బురదకోట, వంతాడ, లింగంపర్తి, భద్ర వరం, సిరిపురం, ఎర్రవరం, కొండతిమ్మాపురం, పొదురుపాక, పాండవులపాలెం, తాడువాయి, పెద్దమల్లాపురం, వేళంగి, అనుమర్తి, ఆవెల్లి, ఒండ్రేగుల గ్రామాలను అనుకొని వున్న అటవి ప్రాంతమునకు పెద్ద పులి సంచరించు అవకాశము వున్నందున సమీప గ్రామ ప్రజలను అప్రమత్తం చేసి వారు పశువులను సమిప అడవిలోనికి పంపించవద్దని, గ్రామ ప్రజలు గుంపులుగా తిరగాలని, ఎవ్వరూ కూడా ఒంటరిగా సంచరించవద్దని కరపత్రాలు పంచడం జరిగిందన్నారు. అలాగే ప్రత్తిపాడు తహసిల్దారు, ఏలేశ్వరం తహసిల్దారు, శంఖవరం తహసిల్దారులకు, ప్రత్తిపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్, ప్రత్తిపాడు పోలీసు స్టేషన్ వారికి కూడా సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొని తల్లి , కూతురు మృతి

విశాలాంధ్ర - గోపాలపురం : మండలంలోని దొండపూడి గ్రామ రోడ్డు శివారులో స్కూటీపై వెళుతున్న తల్లి కూతుళ్లు ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. ఆదివారం మండలంలోని దొండపూడి నుండి కుంకాల వైపు స్కూటీ మీద వెళ్తున్న ఇద్దరు మహిళలు కురసాని కాంతమ్మ 45 గ్రామం బక్క బండార్ల గూడెం అమ్మ, కవలం గన్నమ్మ 75 బక్కబండార్ల గూడెం పోలవరం మండలం, దొండపూడి గ్రామం చివారు కుంకాల రోడ్డులో స్కూటీపై వెళ్ళ అదే రోడ్లో వెళ్తున్న ముందు ట్రాక్టర్‌ను క్రాస్ చేసి తన మార్గంలో కుంకాల వైపు వెళ్తుండగా అసమయంలో ఎదురుగా వస్తున్న ఇంకొక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి ఢీకొట్టగా ఇద్దరు ట్రాక్టర్లో పడిపోయి, రోడ్ మీద పడడంతో తలకి బలమైన గాయాలు అయ్యాయి. అక్కడ ఉన్న ప్రజలు అటువైపు వెళుతున్న ఆటోలో ఎక్కించి ఎల్ ఎన్ డి పేట గవర్నమెంట్ హాస్పిటల్ తీసుకెళ్లగా అక్కడికి పోలవరం 108 అంబులెన్స్ రాగా అక్కడనుండి రాజమండ్రి గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకు వెళ్ళగా కురసాని కాంతమ్మ మృతి చెందారు. గాయాలు తో ఉన్న రెండవ ఆమె కాంతమ్మ తల్లి కవలం గన్నమ్మను ప్రైవేట్ హాస్పటల్ కి తీసుకుని వెళ్లి మెరుగైనవైద్యం కోసం రాజముండ్రి గవర్నమెంట్ హాస్పిటల్ నుండి అంబులెన్సులో గన్నమ్మ ను తీసుకొని వెళుతుండగా ఆమె మార్గమధ్యలో మృతి చెందినది. మృతులను రాజమండ్రి గవర్నమెంట్ హాస్పటల్లో ఉంచారు. మృతి చెందిన గనమ్మ కొడుకు, కాంతమ్మ తమ్ముడు గంగరాజు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదుచేసి సతీషకుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గజ్జనపూడిలో పలు కుటుంబాలకు ఆర్థికసాయం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని గజ్జనపూడిలో ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ నేత ముదునూరి మురళీరాజు పర్యటించారు. ఈ సందర్భంగా మురళీ రాజు సోమవారం పలు కుటుంబాలను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కొల్లి ఏసుబాబు కుమారుడు ఇటీవల ప్రమాదవసత్తు గాయపడ్డ సంద ర్భంగా, అలాగే చుక్కల రాజులు ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందిన సందర్భంగా అలాగే యల్లపు చంద్రమౌళి కుమారుడు ఇటీవల ప్రమాదవశాత్తు చనిపోవడంతో కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

టేకిలో శ్రీ గణపతి రెస్టారెంట్ సీజ్

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామం శ్రీ వైన్స్ బ్రాందీ షాపు వద్ద శ్రీ గణపతి రెస్టారెంట్‌లో పాడయిన నాన్ వెజ్‌కూరలు, నిల్వఅయిన చికెన్ జాయింట్లు, బిర్యాని వంటి ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారని వినియోగదారులు స్థానిక పంచాయతీ అధికారులకు ఫిర్యాధు చేశారు. వినియోగ దారులు ఇచ్చిన ఫిర్యాధు మేరకు టేకి గ్రామ పంచాయతీ కార్యదర్శి కె రామకృష్ణ, విఆర్‌వోలు నాగమణి, బి వెంకటేశ్వరావు, ఏఎన్‌ఎమ్ భాగ్య లక్ష్మి రెస్టారెంట్‌ని సందర్శించి, నిల్వయిన ఆహార పదార్థాలును గుర్తించారు. గ్రామస్తులు, పెద్దలు సమక్షంలో కుళ్లిన ఆహార పదార్థాలు శాంపిల్స్ తీసి పరీక్ష నిమిత్తం ఆహార భద్రత అధికారులకు పంపారు. ఈ ఫాస్ట్ ఫుడ్ షాపుకి పంచాయతీ అనుమతి సహితం లేదని కార్యదర్శి కె రామాకృష్ణ మీడియాకు తెలిపారు. నిల్వ ఆహార పదార్థాలు గోతిలో పూడ్చి, షాపు సీజ్ చేసినట్లు తెలియచేశారు.

టీమ్ సెలక్షన్ ట్రయల్స్ ప్రారంభించిన నల్లమిల్లి

విశాలాంధ్ర - పెదపూడి : ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ (మెన్) టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్స్ ట్రయిల్స్ 2024-25ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. సోమవారం మండలంలోని గొల్లల మామిడాడలో డిఆర్‌కె రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఇంటర్ కాలేజియేట్ వాలీబాల్ (మెన్) టోర్నమెంట్ కమ్ యూనివర్సిటీ టీమ్ సెలెక్షన్స్ ట్రయిల్స్ 2024-25ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నేతలు నల్లమిల్లి సుబ్బారెడ్డి, రావాడ నాగు, కార్యకర్తలు, కళాశాల యజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

పిజిఆర్‌ఎస్‌లో అర్జీలను స్వీకరించిన కేతన్ గర్గ్

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన"పి జి ఆర్ ఎస్ - మీ కోసం" లో ప్రజల నుంచి 19 అర్జీలను స్వీకరించామని మునిసిపల్ కమిషనర్ కేతన్ గర్గ్ తెలియచేశారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర పాలక సంస్థ పరిధిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నాణ్యతతో కూడిన విధంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోంటామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణా, మౌలిక సదుపాయాలు కల్పించడం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ అదనపు కమిషనర్ ఎస్. వెంకటరమణ, నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న, ఎస్ఈజి పాండురంగారావు, సిటీ ప్లానర్ కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

జుత్తుగ వెంకన్న వర్ధంతి

విశాలాంధ్ర - కపిలేశ్వర పురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండ లం జుత్తుగ వెంకన్న చారిట బుల్ మెమోరియల్ ట్రస్ట్, మాచరమెట్ల వారి ఆధ్వర్యంలో జుత్తుగ వెంకన్న 22వ వర్ధంతి పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అంగర నందు 23 మంది గర్భిణీలకు వేరుశనగ చిక్కి , ఫలాలను, కపిలేశ్వరపురంలోని భవిత స్కూల్లో ఉన్న 40 మంది మానసిక వికలాంగ పిల్లలకు పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. గ్రామంలో 40 మంది వృద్ధులుకు, వికలాంగులకు దుప్పట్లు, పంపిణీ చేశారు.

సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

కమిషనర్ భావన

విశాలాంధ్ర - కాకినాడ : డయల్ యువర్ కమిషనర్, ప్రజా వ్యతిరేక ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీల పరిష్కారానికి సత్వరం చొరవ చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి కమిషనర్ భావన హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు ఆరుగురు డయల్ యువర్ కమిషనర్ నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను ఆధికారులకు వివరించారు. అనంతరం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని..పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ ఇలా పలు సమస్యలపై సుమారు 14 వరకు అర్జీలు అందాయి. వాటిపై అదనపు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్లైన్లో పొందుపరచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కెటి సుధాకర్, నగరపాలక సంస్థ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కె మనోహర్, ఎస్ఈ కామేశ్వరరావు, మేనేజర్ శిరీష్, అకౌంటెంట్ సత్యనారాయణ, ఏడీహెచ్ సిరిల్, టీపీఆర్వో శైలజ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ అభ్యర్థి రామమోహన్‌రావు ముమ్మర ప్రచారం

విశాలాంధ్ర - కాకినాడ : తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ మీజ ఇండిపెండెంట్ అభ్యర్థి బండారు రామమోహన్‌రావుకు మద్దతుగా నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు, అధ్యాపక-ఉపాధ్యాయ మిత్ర బృందం ముమ్మర ప్రచారం చేస్తున్నారు. తమ ప్రచారంలో భాగంగా అంబేద్కర్ కొనసీమ జిల్లాలో పిగన్నవరం నియోజకవర్గం, అమలాపురం పట్టణాల్లో గల ఆయా మండలాల్లో పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, బార్ కౌన్సిల్, ఐఎంఏ కార్యాలయాలను సందర్శించి గ్రాడ్యుయేట్లను ఓటు కోసం అభ్యర్థించారు. ఆయా ఏరియాల్లో గల ఆంధ్రా విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో వివిధ మండలాల్లో జరిగిన సమావేశాల్లో పాల్గొని గ్రాడ్యుయేట్లను ఉద్దేశించి ప్రసంగించారు. మొదటి ప్రాధాన్యత ఓటు బండారు రామమోహన్ రావుకు వేసి గెలిపించవలిసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో వీరిన గోపాలం, మోపూరు బాబూరావు, రంకిరెడ్డి శ్రీనివాస్, అబ్బిరెడ్డి సోమేశ్వరరావు, నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు బృందం దరుపున నూకల దేవా, విల్ల శ్రీరామ్, బండారు సంతోష్, బోణం మనోజ్, ఎమ్ సాయిపవన్ తదితరలు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీని తెరిపించాలని మోకాళ్లపై కార్మికుల ధర్నా

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలని కోరుతూ కార్మికులు సోమవారం మోకాళ్ళపై కూర్చుని దండాలు పెడుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ గత 24 రోజులుగా అనేక విధాలుగా ఆందోళనలు చేపడుతున్న ఫ్యాక్టరీ యాజమాన్యం కానీ, ప్రభుత్వం కానీ పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కలెక్టర్కు నివేదిక అందించిన నేపథ్యంలో కమిటీని నియమిస్తామని చెప్పిన ఇప్పటివరకు కమిటీ ఏర్పాటుపై చర్యలు తీసుకోలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమను నమ్ముకుని జీవిస్తున్న కార్మికులు ఉపాధి లేక అర్ధాకలితో అలమటిస్తున్న ప్రభుత్వానికి గాని ప్రజా ప్రతినిధులు కానీ కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం వీరబాబు, చక్రధర్, గోవింద్, జయలక్ష్మి, శివలక్ష్మి, అన్నపూర్ణ, భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

విశాలాంధ్ర - కాకినాడ : సోమవారం కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. సోమవారం ఈ కార్యక్రమమునకు 43 మంది ఫిర్యాదు దారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియచేసుకున్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు, సూచనలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాలలోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీతెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) వీజీఏ భాస్కర రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులతో వాహనదారుల హర్షం వ్యక్తం

విశాలాంధ్ర - ఆలమూరు : జొన్నాడ-మండపేట ప్రధాన రహదారి మరమ్మత్తుల పనులు సోమవారం ప్రారంభం కావడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఎప్పు డెప్పుడు ఈ రహదారి మరమ్మతుల పనులు మొదల వుతాయా అని కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూశారు. శాసనసభ్యునిగా ఎన్నికయినప్పటి నుంచి నియోజకవర్గంలోని ప్రధానమైన సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న శాసన సభ్యులు బండారు సత్యానందరావు చొరవతో ఈ రహదారి మరమత్తుల పనులకు నిధులు మంజూరు అయ్యాయి. జొన్నాడ నుంచి ఆలమూరు వరకు మరమ్మత్తుల పనుల నిమిత్తం రూ.70 లక్షలు, ఆలమూరు శివారు నుంచి మండపేట వరకు రూ.60 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. దానితో కాంట్రాక్టర్లు మరమ్మతుల పనులను మొదలు పెట్టారు. ఎన్నోఏళ్లగా ఎదురు చూస్తున్న మరమ్మత్తుల పనులు మొదలవడంతో వాహనదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

జెఎన్‌టియుకెలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్ (సిఎస్ఈ) విభాగం మరియు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజస్ సంయుక్త ఆధ్వర్యంలో సెనేట్ హాలు నందు ఈనెల 9వ తేదీ నుండి 13వ తేదీ వరకు "జనరేషన్ ఏఐ ఫర్ డేటా అనలిటిక్స్" వారం రోజుల పాటు ఇంజనీరింగ్ విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించనున్నారు. సోమవారం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేయగా గౌరవ అతిథులుగా ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్, యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ ఎన్ మోహన్‌రావు, ఇండియన్ సర్వర్స్ సిఇఓ డి సాయిసతీష్‌లు విచ్చేశారు. అడ్వాన్స్‌డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు సిఎస్ఈ విభాగాధిపతి ప్రొ ఎన్ రామకృష్ణయ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తుండగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు ఎన్ఎస్ఎస్ఎస్ఎన్ ఉషాదేవి, డా ఎస్ సురేఖలు కో-ఆర్డినేటర్‌లుగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ధూమపానం, మద్యపానం, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, అటువంటప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు మార్గం సుగమమవుతుందన్నారు. ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ప్రొ వి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో ఒక వినూత్న ఆలోచనను ఉత్పత్తిగా తీర్చిదిద్దగలిగితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు.

కుంగ్‌ఫ్యూ కరాటే పోటీలలో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - ఆలమూరు : జాతీయస్థాయి కుంగ్ ఫ్యూ అండ్ కరాటే పోటీలలో ఆలమూరు మండలంలోని జొన్నాడ గ్రామానికి చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచినట్లు ఆ సమస్త గ్రాండ్ మాస్టర్ కే సత్తిబాబు తెలియజేశారు. ఈనెల 8వ తేదీన చిలకలూరిపేటలో న్యూ షావులిన్ కుంగ్‌ఫ్యూ అకాడమీ నిర్వహించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ జాతీయస్థాయి కుంగ్ ఫ్యూ అండ్ కరాటే పోటీలలో వారియర్ మంక్స్ కుంగ్ ఫ్యూ విద్యార్థులు పలు విభాగాల్లో పథకాలు సాధించారన్నారు. వివరాలు ప్రకారం గర్ల్స్ వైట్ బెల్ట్ విభాగంలో మేడపాటి మానస్వి రెడ్డి గోల్డ్ మెడల్, తలంతం మన గోల్డ్ మెడల్, ఎల్లో బెల్ట్ విభాగంలో మేడపాటి గీతిక రెడ్డి సిల్వర్ మెడల్, బాయ్స్ జూనియర్ ఎల్లో బెల్ట్ విభాగంలో వెన్నేటి కిరణ్ సంపత్ గోల్డ్ మెడల్, ఆరంజ్ బెల్ట్ విభాగంలో సుప్రజ సాయి లక్ష్మీ గోల్డ్ మెడల్, సీనియర్స్ బ్లూ బెల్ట్ (ఏ) విభాగంలో కర్రి జై దుర్గా సాయి సిల్వర్ మెడల్, ఎల్లో బెల్ట్ విభాగంలో డి గోవిందరాజు గోల్డ్ మెడల్, బి సూర్య సిల్వర్ మండల్, అరేంజ్ బెల్ట్ విభాగంలో డి అఖిల్, బి శంకర్ గోల్డ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థుల్ని గ్రామానికి చెందిన నాయకులు తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి), నామాల సూరిబాబు, వారియర్ మంక్స్ కుంగ్ ఫ్యూ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, సెక్రెటరీ కే సత్తిబాబు, కోచ్ పి నాని బాబు, శివ సురేష్, తదితరులు అభినందించారు.

ఆదిత్య విశ్వ విద్యాలయంలో అటల్ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - గండేపల్లి : ఆదిత్య విశ్వ విద్యాలయం మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డిపి) సోమవారం ప్రారంభమైంది అని డా ఎం శ్రీనివాస రెడ్డి తెలిపారు. మొదటి రోజు కార్యక్రమంలో ఐఐటి మద్రాస్‌కు చెందిన డాక్టర్ మణివణ్ణన్ పివి హైబ్రిడ్ అండ్ అటానమస్ వెహికల్స్ అనే అంశం పై ప్రసంగించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ వరకు జరిగే ఈ అటల్ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ప్రఖ్యాత విశ్వవిద్యాలయల నుంచి నిష్ణాతులైన ప్రొఫెసర్లు ముఖ్య అతిథులుగా విచ్చేసి తమ విలువైన ఉపన్యాసాలు ఇస్తారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ డాక్టర్ ఎంబి శ్రీనివాస్, డాక్టర్ ఎస్ రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి సురేష్, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ డోలా ఎస్ సంజయ్, డీన్ డాక్టర్ పిఎస్ రంజిత్, డాక్టర్ ఏ శరవణన్, డాక్టర్ జెడి వెంకటేష్, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్‌డివివిఎస్ భీమేశ్వర రెడ్డి, కో-ఆర్డినేటర్ డాక్టర్ సందీప్ కునార్, కో-ఆర్డినేటర్ డాక్టర్ పీవి ఏలుమలై మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - ఆలమూరు : రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆలమూరు తహశీల్దార్ కేజే ప్రకాష్ బాబు తెలిపారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఈనెల 10వ తేదీ నుండి రోజు కొక గ్రామంలో గ్రామసభలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆ గ్రామంలోనే అందుబాటులో ఉంటారన్నారు. రైతులు వివరాలను రికార్డులలో సరి చూసుకోవాలని, ఏమైనా తేడాలుంటే గ్రామ సభల్లో అక్కడికక్కడే పరిష్కరిస్తామని వివరించారు.

మొబైల్ వైద్యశాల ఉచిత నేత్ర శిబిరం



విశాలాంధ్ర - జగ్గంపేట : మండల కేంద్రమైన జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం రాజమండ్రి మొబైల్ వైద్యశాలచే ఉచిత నేత్ర, దంత శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో తహశీల్దార్ జెవిఆర్ రమేష్ ఉచితంగా కంటి, దంత పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేస్తామన్నారు.

14న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - కొవ్వూరు :పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించడంలో ఇరు పక్షాల మధ్య రాజీ కుదిర్చి లోకదాల ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించడంలో కృషి చేయాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి కే రత్న ప్రసాద్ తెలిపారు. జిల్లా కోర్ట్ ఆదేశాల మేరకు సోమవారం కొవ్వూరు కోర్ట్ హాల్ లో 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.అను రాధా, డిఎల్ఎస్ఏ కే.రత్న ప్రసాద్ సంయుక్తంగా పోలీస్ న్యాయవాదులతో సమేవేశం ఏర్పాటు చేసారు.ఈ సమేవేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఎల్ఎస్ఏ సెక్రెటరీ రత్నప్రసాద్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పోలీస్ స్టేషన్ లలో పెండింగ్లో ఉన్న కేసులు, రాజి పడదగిన కేసులను గుర్తించాలని, అటువంటి కేసులపై రాజీ కుదిర్చి లోక్ అదాలత్ త్ ద్వారా కేసులు పరిష్కారంలో కృషి చేయాలన్నారు . అనంతరం న్యా య వాదులతో కూడా సమేవేశం ఏర్పాటు చేసి ఈ లోక్ అదాలత్ లో ఎక్కువ కేసులు రాజీ చేయవలసిందిగా కోరారు .ఈ సమేవేశం లో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయి కృష్ణ 2క్లాస్ మేజిస్ట్రేట్ కే.నాగ లక్ష్మి 1క్లాస్ మేజిస్ట్రేట్ జెబీ టీఎస్.దేవి .కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ మరియు సి ఐ లు ఎస్సైట్కు లు పోలీసులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.చలపతి, ఉపాధ్యక్షులు వెంకటేష్, న్యాయవాదులు పాల్గొన్నారు .

అలయన్స్ జీవితకాల సభ్యుల పెంపు దిశగా కృషి

విశాలాంధ్ర - కాకినాడ : అలయన్స్ సంస్థ జీవిత కాల సభ్యుల పెంపు దిశగా దక్షిణ భారత దేశంలోని అందరు గవర్నర్స్ కృషి చేయాలని అలయన్స్ అంతర్జాతీయ అధ్యక్షులు అలై బాలచంద్రన్ తెలిపారు. స్థానిక ఫర్న్ రెసిడెన్సీలో జరిగిన దక్షిణ భారత కౌన్సిల్ సమావేశానికి కౌన్సిల్ చైర్మన్ యస్ రాజేంద్రన్ హాజరు అయ్యారు. విశిష్ట అతిథిగా పూర్వ అంతర్జాతీయ అధ్యక్షులు అలై బి తిరుపతి రాజు హాజరై మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కూడా అలయన్స్ సేవలు విస్తరించాలని మరిన్ని క్లబ్లే కాదు జిల్లాలు కూడా స్థాపించాలని సంఘ పటిష్టతకు గవర్నర్లు క్లబ్ డ్యూస్, ఇంటర్నేషనల్ డ్యూస్ చెల్లించాలని కోరారు. సమావేశంలో డా చప్పిడి స్వాగత ఉపన్యాసం చేస్తూ సమావేశానికి హాజరైన అంతర్జాతీయ నాయకులకు, సౌత్ ఇండియా నాయకులకు కృతజ్ఞతా అభినందనలు తెలియచేస్తూ మీ అందరిలో ఒకడిగా సంస్థ అభ్యున్నతకు కృషి చేస్తానని తెలియచేసారు. సమావేశంలో 247 జిల్లా పూర్వ గవర్నర్ అలయన్స్ శిక్షణ సంస్థ చైర్మన్ అలై కల్లాజగరు, సుమతిలకు 4సంవత్సరాలులో 500 జీవితసభ్యులను ఇచ్చినందుకు గాను ప్రత్యేకంగా అభినందించారు. అలాగే సమావేశంలో 50 జీవిత కాల సభ్యులను ఇచ్చిన వనం శ్రీనివాస్ రావును అభినందించారు. ఈ కౌన్సిల్ సమావేశానికి చైర్మన్గా వ్యవహరించిన డా చప్పిడి వెంకటేశ్వరరావు ను అంతర్జాతీయ అధ్యక్షులు ఘనంగా సత్కరించారు. అలై రాజేంద్రన్ మాట్లాడుతూ 25-26 సంవత్సరానికి గాను కౌన్సిల్ చైర్మనగా అలై సర్వానన్‌ను, వైస్ ఛైర్మన్‌గా అలై అంజయ్యను ప్రతిపాదించటం జరిగింది. సమావేశంలో పూర్వ అంతర్జాతీయ అధ్యక్షులు అలై కోడూరు రంగారావు, మొదటి ఉపాధ్యక్షులు అలై డిబిజి శాస్త్రి, అంతర్జాతీయ కోశాధికారి రాజేశ్వరరావు, అంతర్జాతీయ డైరెక్టర్ మాటూరు శిరీష, శరావానన్, అంజయ్య, 106 డిస్ట్రిక్ట్ ఉపగవర్నర్ మునిరెడ్డి, పూర్వ గవర్నర్ వరలక్ష్మి, ఉప గవర్నర్ కెవివి సత్యనారాయణ, కిరణ్, కృష్ణ ప్రసాద్, సదనాని, శ్రీరాములు, గోవిందరాజులు, శివకుమార్ పాల్గొన్నారు.

తాడిమళ్లలో సామాజిక పింఛన్ల తనిఖీ

విశాలాంధ్ర - నిడదవోలు : డిసెంబర్ 9,10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల తనిఖీని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించడంతో తాడిమల్ల గ్రామ సచివాలయం నెంబర్ 1 పరిధిలోని సామాజిక పింఛన్ల తనిఖీ నిర్వహించారు. ముగ్గురు కలిసి బృందంగా ఏర్పడి తనిఖీ నిర్వహించారు. సచివాలయం ఒకటి పరిధిలో453 పెన్షన్ లబ్ధిదారులు ఉండగా 12 బృందాలు ఈ తనిఖీల్లో పాల్గొన్నాయి. దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో అనర్హులు లబ్ధి పొందుతున్న వారిని గుర్తించడం కోసం వార్డు సచివాలయ పరిధిలోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన బృందాలు వివరాలు సేకరిస్తున్నారు. ఒక్కో బృందం 40 పింఛన్లను తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలో డిఆర్డిఏ పిడి ఎన్వివిఎస్ మూర్తి, డిఎల్డిఓ స్వామిరెడ్డి,ఎంపీడీవో లక్ష్మీనారాయణ బృందాలను పర్యవేక్షించారు

ప్రమాద హెచ్చరికలు లేని డివైడర్

విశాలాంధ్ర - నల్లజర్ల : నల్లజర్ల గ్రామంలో మూడు రోడ్ల కూడలిలో గత వైసీపీ ప్రభుత్వంలో ఏలూరు నుండి రాజమండ్రి వెళ్లే మార్గంలో డివైడర్ నిర్మించారు. డివైడర్‌కి ఇరుపక్కల ఎటువంటి ప్రమాద హెచ్చరికలు పెట్టలేదు. రాత్రిపూట ఎదురుగా వస్తున్న వాహనాల కాంతికి డివైడర్ కనిపించక వాహన దారులు ఆ డివైడరును తాకడం వల్ల యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి డివైడర్ కు ఇరుపక్కల కూడా డేంజర్ మార్క్‌ల గుర్తులు పెట్టాలని వాహనదారులు ప్రయాణికులు తమ గోడును వెళ్ళబుచ్చుకున్నారు. ట్రాఫిక్ పోలీస్ ఏర్పాటు చేస్తే బాగుంటదని ప్రజానీకం తెలియజేశారు

గోపాలపురంలో యుటిఎఫ్ విజయోత్సవం

విశాలాంధ్ర - గోపాలపురం : తూర్పు పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో బొర్రా గోపి మూర్తి భారీ విజయం సాధించడంతో ఉపాధ్యాయ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక చెక్పోస్ట్ సెంటర్ వద్ద యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో విజయోత్సవ ర్యాలీ, ఎమ్మెల్సీ ఎన్నిక లలో బొర్రా. గోపి మూర్తి. భారీ విషయం సాధించి నందుకు హర్షం వ్యక్తం చేస్తూ, విజయోత్సవ ర్యాలీ చేసి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఏ జాన్ బాబు, జి వెంకటేశ్వరరావు, ఎం. నాగేశ్వరరావు, ఎలిపే. వెంకటేష్, వి ఎస్ ఆర్ కె వి ప్రసాద్, జి రవి, ఎస్కె ఇ ధైతుల్లా సిహెచ్. సూరి చంద్రం, జై శ్రీనివాస్, పి తేజ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాలను విక్రయించే దుకాణాలను వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు పి మాధవి ఆధ్వర్యంలో అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు మండలంలోని ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల షాపులను తనిఖీలు నిర్వహిస్తున్నామని, లింగంపర్తి గ్రామంలో తనిఖీలో భాగంగా కొండ తిమ్మాపురం రోడ్డులో గుల్లింకల శేషగిరికి చెందిన గోడౌన్ నందు లైసెన్స్ లేకుండా వరి విత్తనాలు నిల్వ ఉంచి రైతులకు విక్రయిస్తున్నట్లు గుర్తించి, సుమారు 20,400 విలువగల, ఒక్కొక్కటి 25 కేజీల బరువు గల 17 బస్తాలను సీజ్ చేసి, 6ఎ కేసును వారిపై నమోదు చేసినట్టు తెలిపారు. పురుగు మందులు, ఎరువులు షాపుల నిర్వహణదారులు తగు జాగ్రత్తలు పాటించాలని, పురుగు మందులు ఇష్టారీతిన విక్రయించరాదని, అలా చేస్తే లైసెన్స్ రద్దు చేయబడునని, ఫామ్-ఎన్ స్టాక్ రిజిస్టర్, ఫామ్-ఎమ్ బిల్లులు రైతులకు తప్పనిసరిగా ఇవ్వాలని, ఎంఆర్పి ధర కన్నా అధిక ధరకు ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ ఐఎల్ ల్యాబ్ ఏటి కరుణాకర్, మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి, విఆర్ ఓలు సిహెచ్ నాగేశ్వరరావు, వై లక్ష్మి ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

విశాలాంధ్ర - జగ్గంపేట : 16వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం హైవే మైంటెనెన్స్, పోలీస్ సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టారు. హైవే పై వెళ్ళే వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రేడియం స్టిక్కర్లతో కూడిన పెద్ద ట్రైలన్లు, జిగ్ జాగ్ , రెడ్ ఫ్లాగ్లు జీవియర్ జంక్షన్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేశారు. వాటిని అలాగే మండలంలోని రామవరం హైవేను ఆనుకుని ఉన్న మల్లిపాక వెళ్ళే అండర్ పాస్ వంతెన కింద మార్గాన్ని పెద్దాపురం డిఎస్పి శ్రీహరిరాజు పరిశీలించారు.

ఇళ్ల స్థలాలపై కదం తొక్కిన సీపీఐ

- అదానీ గ్రూప్ అవినీతిపై జేపీసీ వేయాలి
- జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

విశాలాంధ్ర - రాజమండ్రి : ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు వెంటనే మంజూరు చేయాలని అదానీ గ్రూప్ చెందిన అవినీతిపై పార్లమెంటరీ సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ జరగాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ వద్ద పెద్ద ఎత్తున నిరుపేదలందరూ విచ్చేసి కదం తొక్కారు . అనంతరం అక్కడి నుండి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు అనంతరం మున్సిపల్ కమిషనర్ కు దరఖాస్తులను అందజేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఎన్నికల ముందు రాజమండ్రిలో అన్ని వార్డులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసిందని కానీ లబ్ధిదారులు ఎవరికి ఇళ్ల స్థలాలు చూపించలేదని ఆయన విమర్శించారు అధికారంలోకి వచ్చేముందు కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చిందని ఈ నేపథ్యంలో ప్రభుత్వం వెంటనేదరఖాస్తు చేసుకున్న పేదలందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారుమేము ఇచ్చిన దరఖాస్తులను ప్రభుత్వం విచారణ చేసి వారందరికీ సంక్రాంతి లోగా పట్టాలు మంజూరు చేస్తే లబ్ధిదారులు ముఖంలో చిరునవ్వు ఉంటుందని దీనిమీద రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే రూరల్ ఎమ్మెల్యే స్పందించి లబ్ధిదారులకి న్యాయం చేయాలని మధు కోరారు మోడీ అధికారంలోకి రాకముందు ఆదాన్ని ఎవరో భారతదేశ ప్రజలకు తెలియదని మోడీ పాలనలో అక్రమ వ్యాపార చేశారని ఈ సామ్రాజ్యం విదేశాలకు కూడా ఆయన అన్నారు దేశంలో ఉన్న సహజ వనరులను దోచుకోవడానికి అదానీ ముందు ఉంటారని అన్నారు ఈ కార్యక్రమం లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి , జట్ల సంఘము అధ్యక్షులు కె రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వి కొండలరావు సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె బోడకొండ సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఎస్ నౌరోజీ, లావణ్య, కె శ్రీనువాస్, టీ నాగేశ్వరావు, జట్ల సంఘము నాయకులు అప్పల నాయుడు, దేముడు బాబు వెంకటరావు సీపీఐ నాయకులు రామరాజు, మహిళలు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - సామర్లకోట : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సామర్లకోట మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమ్మెబాట పట్టారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు ఉండవల్లి వివి రామరాజు మాట్లాడుతూ టెక్నికల్ కార్మికులకు రూ.29,200, నాన్ టెక్నికల్ కార్మికులకు రూ.24, 500 వేతనం ఇవ్వాలని, 15 సంవత్సరాలు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందిన వారికి రూ.5 లక్షలు, కుటుంబంలో ఒక ఉద్యోగం ఇవ్వాలని, సీనియార్టీ ప్రాతిపదికన జీతాలు చెల్లించాలని, హెచ్ఆర్సీ పాలసీ అమలు చేయాలని, కార్మికులైన తమకు సంక్షేమ పథకాలు కూడా అమలు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి పులపకూరి రామకృష్ణ, ఉప కార్యదర్శి కాటంరెడ్డి ఏసు, కోశాధికారి సక్కు రత్నరాజు, ఇంజనీరింగ్ కార్మికులు కాకాడ నాగార్జున, కురుకూరి మురళీకృష్ణ, చిక్కాల నాగార్జున, కాపవరపు నూకరాజు, కొరపాటి రమణమూర్తి, వరద రమేష్ బాబు, వార సన్నిబాబు, కమ్మిల శ్రీనివాస్ కాటంరెడ్డి శ్రీను, కొరపాటి వివి సత్యనారాయణ, చంద్రు వెంకట రాజేష్, మేడిపోయిన వెంకటరమణ, డి వెంకటేశ్వరరావు, కీర్తి వెంకట సుబ్రహ్మణ్యం, మనేం అపర్ణేశ్వరి, అపర్ణ భాగ్యలక్ష్మి, బిక్కిన భూదేవి, ఆకుల సంతోషి, లంకా శ్రీహరి, గరగా స్వామి, మామిడాల కొండబాబు పాల్గొన్నారు.

రామచంద్రపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి పిలుపుమేరకు డిసెంబర్ 9వ తేదీన అవుట్సోర్సింగ్ కార్మికుల జీతాల పెంపు మరియు పారిశుద్ధ్య కార్మికుల వేతనాల పెంపుకై గత ప్రభుత్వంలో అంగీకరించిన మినిట్స్ను తక్షణమే అమలు చేయాలని, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పెండింగ్లో ఉన్న సరెండర్ లీవులు ఎన్కేష్ మెంట్ విడుదల చేయాలని మరియు స్థానికంగా రామచంద్రపురం మున్సిపాలిటీలో సమస్యలను వివరిస్తూ పుష్ కార్డులు పూర్తిగా దెబ్బ తినడం వలన కొత్త పుష్ కార్డులు కేటాయించాలని , రోజువారి హాజరు సచివాలయాలు వద్ద కాకుండా ఇన్స్పెక్టర్ సమక్షంలో తీసుకోవాలని పై విషయాలపై చర్యలు తీసుకోవాల్సిందిగా కమిషనర్కు వినతి పత్రం అందజేశారు. సమస్యలపై స్పందించి కమిషనర్ వెంటనే అమలు జరిగే లాగా చూస్తానని కార్మికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బండి సత్యనారాయణ, సెక్రెటరీ గొర్రుపతి రాజు, పెద్దిరెడ్డి రాము, ఏఐటీయూసీ నాయకులు, మాచర రావు, సంపర సుధా, ముత్యాల సుజాత, వడ్డాది రాజు, దివిలి రవి, గూడుపు నూకరాజు తదితర కార్మికులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచి పర్మినెంట్ చేయాలి

ఏఐటియుసి నాయకులు సాకారామ కృష్ణ డిమాండ్

విశాలాంధ్ర - పిఠాపురం : రాష్ట్రంలో మున్సిపల్ రంగంలో పని చేసే పారిశుద్ధ ఇంజనీరింగ్ విభాగం కార్మికులకు వేతనాలు పెంపు పర్మినెంట్ చేయాలని గత ప్రభుత్వంలో మినీ రూపంలో ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సోమవారం స్థానిక ఆర్ఆర్ పార్కు సమీపంలో యూనియన్ అధ్యక్షులు బంగారు కన్నయ్య ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర పిలుపు భాగంగా నిరసన కార్యక్రమంలో పిఠాపురం మున్సిపాలిటీ యూనియన్ గౌరవ అధ్యక్షులు సాకారామకృష్ణ పాల్గొని మీడియాతో మాట్లాడారు. ఇంచుమించుగా 20 ఏళ్లుగా కార్మికులు విధులు నిర్వహణ చేస్తున్నారని, వారి సర్వీసు అయిపోతున్న ఇంత వరకు కనీస పనికి కనీస వేతనం పర్మినెంట్ చేయకపోవడం బాధాకరమన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవులు, ఐఆర్ 11, 12 పిఆర్సీలు అమలు చేయాలని, పనిముట్లు లేక కార్మికులు సొంత డబ్బులతో పనిముట్లు కొనుక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో వైసిపి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఔట్సోర్సింగ్ కార్మికులు పర్మినెంట్ చేస్తామని, ఎన్నికలయి అధికారం చేబట్టిన ఐదు సంవత్సరాలు కాలంలో చర్చలు సమావేశాలు అంటూ కాలయాపన చేశారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు మిని రూపంలో ఆగిపోయాయని, వాటిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చక్కాపులకొండ, గూడుపు సత్యవతి, పొట్నూరు అమ్ములు, సిహెచ్ దాసు, రాయవరపు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

విశాలాంధ్ర -భీమవరం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలు పరిష్కరించడంలో అలసత్వం వహించవద్దని ఎస్పీ అద్నాన్ నయీం అస్మిఅన్నారు, సోమవారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరిష్కార వేదికకు జిల్లా నలుమూల నుండి నాలుగు ఫిర్యాదులు అందాయని వాటిని వెంటనే పరిశీలన చేసి పరిష్కారం చూపే విధంగా కృషి చేయాలని పోలీస్ అధికారులకు ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వి. భీమారావు గారు,జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీ వి.పుల్లారావు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్ఐసి నూతన విధానాలు రద్దు చేయాలి

విశాలాంధ్ర - కొవ్వూరు : పాలసీదారులకు ఏజెంట్లకు నష్టం కలిగించే ఎల్ఐసి యాజమాన్యం నూతన విధానాలను రద్దు చేయాలని లేకపోతే ఉద్యమం మరింత తీవ్రత తరం చేస్తామని కొవ్వూరు లియోఫీ అధ్యక్షులు పి ఎన్ కిషోర్ తెలిపారు. ఎల్ఐసి యాజమాన్యం తీసుకున్న విధానాలను రద్దు చేయాలని కోరుతూ లియోఫీ ఆధ్వర్యంలో సోమవారం రాజమండ్రి డివిజన్ కార్యాలయంలో మహా ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమానికి కొవ్వూరు నుండి నాయకులు బైక్ ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా లియోఫీ కొవ్వూరు బ్రాంచ్ అధ్యక్షులు కిషోర్ మాట్లాడుతూ ఎల్ఐసి యాజమాన్యం ద్వంద్వ ధరణిగా వ్యవహరిస్తుందని, అన్నారు. యాజమాన్యం తీసుకున్న నూతన విధానాలకు పాలసీదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు తక్షణమే నూతన విధానాలను రద్దుపరిచి పాత విధానాలనే అమలు పరచాలని లేనిచో ఉద్యమం మరింత తీవ్రతను చేయడం జరుగుతుందని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో కొవ్వూరు లియోపీ కార్యదర్శి ఆ కాన శ్రీనివాస్, కోశాధికారి పోషేష్ కుమార్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు

ధాన్యం తడవకుండా చర్యలు

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : జిల్లాలో వర్షాల నేపథ్యంలో ధాన్యం దెబ్బతినకుండా వ్యవసాయ, పౌరసరఫరాలు, రెవెన్యూ శాఖల సిబ్బందిని అప్రమత్తం చేశామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. జిల్లాలో రెండు రోజుల్లో సుమారు లక్షా 6 వేల 500 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద ఉందన్నారు. తుఫాన్ కారణంగా జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం రక్షణ రైతులకు టార్పాలిన్లు అందిస్తున్నామన్నారు. ఎక్కడా ధాన్యం తడవకుం డా జాగ్రత్త చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో రైస్ మిల్లర్లకు కూడా ధాన్యం సేకరణపై తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. రైస్ మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉందని వాటిని వెంటనే రైస్ మిల్లులకు చేర్చేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వర్షాల పడే హెచ్చరికల దృష్టిలో ఉంచుకుని అవసరమైన టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 22 వేల 826 మెట్రిక్ టన్నులు ధాన్యం రైస్ మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉందని, వాటిని వెంటనే తరలించేలా రెవిన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖాధికారులను అప్రమత్తం చేశామన్నారు. .రానున్న రెండు రోజులలో వర్షాల కురుస్తాయన్న హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయాధికారులు సమన్వయము చేసుకుని వారి సూచనల మేరకు వరి కోతలు చేపట్టాలని కలెక్టర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ధాన్యం తరలింపులలో రైతులకు ఏమైనా సమస్యలుంటే దగ్గరలోని వ్యవసాయ, రెవిన్యూ,పౌరసరఫరాల అధికారులను దృష్టికి తీసుకువెళితే పరిష్కరిస్తార న్నారు.రైతులు తమ సమస్యలను 18004256453 లేదా 08812-230 448, 7702003584 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేసినట్లతే అధికా రులు తగు పరిష్కార చర్యలు తీసుకుంటారని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేసారు.

అర్జీలను పరిష్కరించాలి : కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర - భీమవరం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను ఎక్కడా జాప్యం లేకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదల వాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్తో పాటు డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ,వార్డు సచివాలయాల అధికారి వై.దోసి రెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కె.సి.హెచ్.అప్పారావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పి జి ఆర్ ఎస్ అర్జీల పరిష్కారం పై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి అధికారులు పనిచేయాలని, ప్రతీ అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కరించాలని ప్రతీ అర్జీని ఆడిటింగ్ చేయడం జరుగు తుందని, ప్రజల నుండి అందే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని, అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కె.ఆర్.ఎస్.సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డా. కె.సి హెచ్ అప్పారావు, వయోవృద్ధుల ట్రిబనల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల దరఖాస్తులు స్వీకరణ

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు కోర్ట్ పరిధిలోని మండల నుంచి పారా లీగల్ వాలంటీర్లు (న్యాయ సేవ సహాయకులుగా)పని చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లుగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ 9వ అదనపు జిల్లా జడ్జి అనురాధ తెలియ జేశారు . న్యాయ సేవ సంస్థల ఆదేశాల మేరకు ఈ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వివరించారు. పదో తరగతి అర్హత కలిగివుండాలి .రిటైర్డ్ టీచర్లు .లెక్చర్లు సీని యర్ సిటీజెన్స్ సోషల్ వర్కర్స్ .స్టూడెంట్స్ డ్వాక్రా మహిళలు సంఘాల ప్రతినిధులు పారా లీగల్వాల ంటీర్లుగా దరఖాస్తుచేసేందుకు అర్హులని, ఆసక్తి వున్నవారు తమ బయో డేటా విద్య అర్హ త జీరాక్స్ కాపీ లను జత చేశి దరఖాస్తు తో పాటుగా కొవ్వూ రు కోర్ట్ మండల లీగల్ సర్వీస్ కమిటీలో అందజేయాలని సూచించారు. ఆఖరు తేదీ 18, 08813-231188 ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని తెలిపారు